

అడల్ట్స్ ఓన్లీ కథ

# చూసే కనులకు మనసుంటే...

బద్దిగం పాండురంగారెడ్డి

గుర్నాధం పాతికేళ్ళవాడు. పనసతొనలాంటి రంగులో వుంటాడు. బియ్యే పాసవడం వల్లకాక వడ్డించేవాడు వుండడం వల్ల గుర్నాధానికి మంచి ఉద్యోగం వచ్చింది.

ఓ మేడ, పది ఎకరాల పొలం వారసత్వ ఆస్తిగా వచ్చింది అతనికి. ఆస్తితోపాటు తండ్రి తాతల బట్టతల కూడా వెంటపడింది. బట్టతల వల్ల హెయిర్ ఆయిల్స్ రాసుకోలేకపోతున్నాడు. ఖరీదైన దువ్వెనతో దువ్వుకోలేకపోతున్నాడు. షాంపూలతో తల రుద్దుకోలేకపోతున్నాడు. ఏ తిరపతో పోయి గుండు కొట్టించుకోలేకపోతున్నాడు.



బట్టతల వల్ల గుర్నాధం ముదురుగా, ముదుసలిగా కనిపిస్తున్నాడు. బ్రహ్మచారినని చెప్పినా నమ్మడం లేదు! 'ఎంతమంది పిల్లలు?' అంటున్నారు.

బట్టతలపై వెంట్రుకలు మొలిపించే నాటు వైద్యం దగ్గర్నుంచి అమెరికన్ లేటెస్ట్ మందుల దాకా వాడినా, అతని గుండు ఎడారిలాగే మిగిలింది.

ఈ బట్టతల వల్లే తనుకోరే సంబంధాలు రావడం లేదు!

పెళ్ళాం అందంగా వుండాలి- మల్లెమొగ్గలా, పువ్వుపై నుంచి జారే మంచుబిందువులా!

అదీ అతని ఆశ.

ఓ ఫ్రెండ్ సలహా మీద ముంబై పోయి విగ్ పెట్టించుకుని వచ్చాడు!

ఆ వుంగరాల జుట్టుకి మురిసిపోయి ఇంటి దగ్గర కూడా విగ్ తీయడంలేదు. మరో విగ్‌ను స్పేర్‌గా కూడా పెట్టుకున్నాడు.

సిన్మా హీరోలు విగ్గు వల్లే అందంగా కనపడుతున్నారు. తనూ అంతే!!

విగ్గు వచ్చిన వేళ మంచిది. అందమైన శశిరేఖతో పెళ్ళయిపోయింది.

తొలిరాత్రి తొందరవేళ అప్సరలాంటి ఆమెను కౌగిలిలోకి తీసుకుని ''రేఖా! నేనెందుకు నచ్చాను నీకు? నాలో ఏం చూసి ప్రేమించావు?'' అన్నాడు.

''మిమ్మల్ని ప్రేమించటం ఏమిటి? పెళ్ళి చేసుకున్నా...!''

శృంగార కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన రచన

''అయితే ప్రేమించటం లేదా?''

''మన ప్రేమ వేరే చెప్పుకోనక్కరలేదు. ఇడ్లీతో బాటే సాంబార్!''

''పోనీ నీకెందుకు నచ్చానో చెప్పు..''

''మీ వుంగరాల జుట్టు నచ్చిందండీ!'' అంది అతని తల వేళ్ళతో దువ్వుతూ.

కెవ్వుమన్నాడు.

''ఏమైందండీ?''

నిజం చెప్పలేక ''గుచ్చుకుంటోంది'' అన్నాడు.

ఆమె సిగ్గుల మొగ్గయి ''ఏమిటా కొంటె మాటలు? పోనీ.. మీకేం నచ్చింది నాలో?'' అంది.

''లడ్డూల్లాంటి నీ బుగ్గలు''

''లడ్డూలు నాకిష్టముండవు. జిలేబీలాంటి బుగ్గలనండీ..''

''నువ్వు ముద్దిస్తే అలాగే అంటాను''

''మరి మీరేం ఇస్తారు?''

''చెప్పకూడదు, చేసి చూపించాలి కాని!'' రాగాల సరాగాలతో తొలిరాత్రి నిద్రని తరిమేసి ఇద్దర్నీ ఒకటిగా చేసింది. యవ్వనం జలపాతమై, మనసు మంచి గంధమై ఆ నులివెచ్చని కోరికల దొంతర నెక్కువ చేసింది.

గుర్నాథం, శశిరేఖ కొత్తకాపురం ప్రారంభించారు.

'భార్యా రూపవతీ శత్రుః' అన్న సామెత గుర్నాధానికి తెల్సు. అలాంటి సిన్మాలు చాలా చూశాడు.

తన ఫ్లాట్స్‌లోని మగకళ్ళు శశిరేఖని పరిశీలిస్తున్నాయని, ఆఫీసు నుంచి తన కొలీగ్స్ చిన్న పనికి, చితక పనికి ఇంటికి రావడం, కావాలని శశిరేఖతో మాట్లాడటం గుర్నాధానికి గుర్రు తెప్పించాయి.

''శశీ! నీ అందం నేనే చూడాలి. పగలు నువ్వు అలంకారం చేసుకోవద్దు. పనిమనిషికంటే అధ్వాన్నంగా వుండాలి. రాత్రికే మేకప్..''

''మరి మార్కెట్‌కి ఎలా వెళ్ళనండి?''

''అన్నీ నేను తెస్తాను. నువ్వెక్కడికీ పోవద్దు''

భర్తకి ఎదురు చెప్పలేక శశిరేఖ అప్పలమ్మలా తయారైంది.

మాసిన, చిరిగిన కుట్టుచీర, కాళ్ళకీ, ముఖానికీ మసి వగైరాలతో పనిమనిషికంటే అసహ్యంగా వుండేది.

గుర్నాధానికి పెళ్ళాం అవతారం నచ్చింది.

కొత్తకాపురం కొత్తపుంతలు తొక్కేవేళ ఆమె ఓ కోరిక కోరింది రాత్రి పడకింటిలో.

ఆమె అధరాల మధురాలు, ఒంటి మెత్తదనం అనుభవిస్తూ...''ఆ చెప్పు, అది ఎలాంటి కోర్కైనా తీరుస్తా'' అన్నాడు.

''రేపు సండే మీకు కుంకుడు రసం పోసి తల అంటుతానండి! ఇది ఎన్నాళ్ళనుంచో నా కోరిక''

''డార్లింగ్! నీకు శ్రమ ఎందుకు? షాంపూతో రుద్దుకుంటా.. అదీకాక తలంటుకుంటే నాకు ఏనుగు రొంప వచ్చేస్తోంది. శీతాకాలం పోనీ.. నీ కోరిక తీరుస్తా''

తనది బట్టతలని పెళ్ళానికి చెప్పలేదు. చెబితే ఈ మొగుడొద్దని పారిపోతుందని భయం.

''పోనీ ఈ కోరికయినా తీర్చండి. మీరే నాకు పులుసుపోయండి''

''దానికేం బ్రహ్మాండం! నువ్వు కళ్ళు మూసుకున్నప్పుడు నీ కొలతలపైన, మడతలపైన కాటేయవచ్చు''

''మరీ తెలుగు శృంగారం డైలాగుల్లా ఘాటుగా వుంటున్నాయి''

మర్నాడే ఆదివారం. ఉదయం పదింటికి టిఫిన్ తిని ఇద్దరూ బాత్‌రూమ్‌లో ప్రవేశించారు.

ఆమె పాత చీర కట్టుకుని ముక్కాలిపీటపై కూర్చుంది.

''చీర పాడైపోతుంది, తీసెయ్యి''

''అది పాడైపోయిన చీరే.. ఫర్వాలేదు''

''చీరుంటే నేను పోయనమ్మా!''

''అంటే ఏదో చూడాలని వుందా? ప్రతి రాత్రి చూస్తూనే వున్నారు కదా!''

''ఈ తడి తడి వేళ తళుక్కులు ఎలా వుంటాయోనని'' అంటూ అతడే చీర విప్పేసాడు.

''అబ్బా.. సిగ్గేస్తుందండీ!''

''మొగుడు దగ్గర సిగ్గేమిటి? కావాలంటే నేనూ వస్త్రాలు విసర్జించుతాను''

''వద్దు. బాత్‌రూమ్ పడకగది అయిపోతుంది. పులుసు పోయండి''



## మరో కేరళ కుట్టి

**పెళ్లయిన కొత్తలో సినిమా ద్వారా సక్సెస్ ఫుల్ హీరోయిన్ అయింది ప్రియమణి. కేరళలో పుట్టినా బెంగుళూరులో పెరిగిన తనని చాలామంది తమిళ అమ్మాయేమో అని అనుకుంటున్నారని ముసిముసిగా నవ్వుతోంది. అయినా నటనకు భాషాభేదాలు లేవు కదండీ అని ఉటంకిస్తోంది కూడా. ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగులోనూ ఆమెకి ఆఫర్లు జోరుగా వస్తున్నాయని సినీవర్గాల సమాచారం.**

అతడు పులుసుపోస్తూ, ఆమె నగ్న శరీరాన్ని తాకుతూ, యిదయిపోతూ, ఏదో అయిపోతూ పోతూ-భార్య ముద్దు తిట్లు తింటూ బాలెన్స్‌గా నుంచోకపోవడం వల్ల కుంకుడు నురుగులో జారిపడ్డాడు.

అయినా అరవలేదు.

క్రిందపడటంతో విగ్గు ఊడిపోయింది. పెళ్ళాం కళ్ళు మూసుకుంది కనక సరిపోయింది. కాలు బెణికినా హడావిడిగా విగ్గుపెట్టేసుకున్నాడు ఆ మానవుడు.

★ ★ ★

పాయసంలో పచ్చి మిరపకాయ వచ్చినట్లు, సిన్మాలో రేప సీన్‌లో రీలు కట్ అయినట్లు వారి స్వీట్ హోమ్‌లో హాట్ న్యూస్ పడింది. గుర్నాధానికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. మారుమూల పల్లెకి! అది సుతారామూ ఇష్టంలేదు... అతనికి ప్లస్ పెళ్ళానికి. పల్లెటూళ్ళు వేస్ట్ అని అతని అభిప్రాయం. దేశమంతా పట్నాలే వుండాలని ఆమె ఆశ.

ఈ సమస్యకి పరిష్కారంగా ఏడుకొండలు కనిపించాడు. ఏడుకొండల దగ్గర మంత్ర దండం ఏమీలేదు. కానీ అతని బామ్మరిది ఈ మధ్యే మినిస్టర్ అయ్యాడు.

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. ఏడుకొండల కోసం బయలుదేరగా బస్‌స్టాండులో ఏడుకొండలు కనిపిం

చాడు. గుర్నాథంలో కళ కళ.

''నాకోసం వస్తున్నావా గుండూ?''

''గుండేమిటోయ్ జుట్టు చూడు''

''విగ్గుల గురించి, పెగ్గుల గురించి, బుగ్గల గురించి నన్నడగరా... జాతకాలు బయట పెడతాను. ఇంతకీ 'సెవెన్ హిల్స్'తో ఏం పని? ఏం మొక్కు?''

''మీ బామ్మరిదికి చెప్పి నా ట్రాన్స్‌ఫర్ ఆపు చేయించాలి. నేనిక్కడే వుండాలి''

''నీ ట్రాన్స్‌ఫర్ బాధపోయింది...ఫో. నిజంగా నీవు బ్రతికిపోయావు. మా బామ్మరిది ఇవాళే ఇక్కడికి వస్తున్నాడు. నాతోనే వుండు. ఏకంగా నిన్ను అతనికి పరిచయం చేసి నీ బాస్‌కి ఫోన్ కొట్టిం చేస్తా''

గుర్నాథం సంబరపడ్డాడు. ఏడుకొండలూ సంతోషపడ్డాడు. గుర్నాథం ఖర్చుమీద ఆటోలో సాయంత్రం దాకా టౌనంతా తిరిగాడు.

''మా బామ్మరిది కార్లో పదిన్నరకి కాని రాడు. ప్రోగ్రాం ఇప్పుడే తెలిసింది. అందాకా ఇంటికిపోదాం''

''ఎవరింటికి?''

''మీ ఇంటికే! నాకీ వూళ్ళో చిన్న ఇల్లేం లేదు''

''మా ఆవిడ వూర్లో లేదోయ్!''

''మరీ మంచిది. మందు కొడుతూ కాసేపు రెస్టు తీసుకోవచ్చు''

'ఇదెక్కడ తద్దినంరా బాబూ!' అనుకుని కాదనలేక తన పని వుండడం వల్ల తీసుకెళ్ళాడు. డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

''ఆమె ఎవర్రా?''

''మా పనిమనిషి''

''పకోడీలు వేయించు...మందుకు కోడి కాని, పకోడిగాని వుండాలి''

గుర్నాథం లోపలికెళ్ళి పకోడీ వెయ్యమని పెళ్ళానికి చెప్పి-

''అయ్యాక పిలు. నువ్వు రాకు'' అన్నాడు.

అతను డ్రాయింగ్ రూంకి వెళ్ళేసరికి ఏడుకొండలు పెగ్గు లాగిస్తున్నాడు.

''బ్రదర్ నువ్వు కూడా లాగించు''

''నాకలవాటు లేదోయ్! నువ్వు కానియ్''

ఏడుకొండలు అతడి దగ్గరగా జరిగి ''మీ పని మనిషి బ్యూటిఫుల్'' అన్నాడు.

''అంత అసహ్యంగా వున్నది అందంగా కనిపిస్తుందా?''

''మసిబారిన మాణిక్యం. పాత చీరకట్టినా పసిడి బంగారంలా వుంది. ఏం ముగ్గులోకి దింపలేదా ఇంకా?''


''ఏంటి?''

''ఆమె దోరవయసును దోచుకోలేదా? నేను మా ఇంటికి వచ్చిన ఏ పనిమనిషిని ఇంత వరకు వదలలేదు''

''ప్చ్.. ఆమె అటువంటిది కాదు''

''నువ్వు వాజమ్మవి. ఎందుకు ఒప్పుకుంటుంది? ఇదిగో ఈ అయిదొందలు ఆమె కివ్వు! ఓసారి నా ముచ్చట తీర్చుకుంటా'' అంటూ డబ్బిచ్చాడు ఏడుకొండలు.

గుర్నాథం గోంగూర పచ్చడి నోట్లో బదులు ముక్కులో పెట్టుకున్నట్లు ఉక్కిరిబిక్కిరయ్యాడు.



ఆమెని ఇప్పుడు పెళ్ళాం అని చెప్పలేడు. ఇప్పుడు చెబితే ఏడుకొండలుని ఏరికోరి శత్రువుని చేసుకున్నట్టే.

''ఏమిటోయ్ ఆలోచన? పోయిరా, నీ ట్రాన్స్‌ఫర్ ఇట్టే ఆపేస్తాను''

లోపలకు వెళ్ళుతుండగా గుర్నాథానికి అయిడియా వచ్చింది.

పెరటి ద్వారా భార్యను పక్కింటికి పంపేశాడు.

''ఆ పో! నీకే అంత పొగరైతే నాకెంతుండాలి'' అని అరుస్తూ లోపలికి వచ్చాడు.

''ఏమిటోయ్ పేచీ పెట్టిందా..?''

''పకోడీల్లో పచ్చిమిరపకాయలు వేయలేదు. కోపం వచ్చి తిట్టా. 'నీ ఇంట పని వద్దు..పో' అని పెరటి దారిన పోయింది''

''పచ్చిమిరపకాయలు వేయలేదని ఇలాంటప్పుడు తిట్టొచ్చా? ఫూల్! నీకందుకే బుర్రమీద వెంట్రుకలు మొలవలేదు. నా మూడ్ పాడైపోయింది. రేపు ఇంటికి వచ్చి కలువు..''

''నీ బామ్మర్ది ఇవాళే వస్తాడన్నావ్?''

''అతను వెయ్యిళ్ళ పూజారి. వస్తాడంటే రాడని అర్థం. అన్నట్టు మీ పనిమనిషి అడ్రస్ తెల్సా?''

''తెలియదు. నిన్నే వచ్చింది. ఇవాళ మానేసింది''

ఏడుకొండలు వెళ్ళిపోయాడు. గాలివాన వెలిసినట్లయింది గుర్నాథానికి.

తన ఐడియా ఎంత ఆపద తెచ్చింది అంటూ వెర్రిగా జుట్టు పీక్కున్నాడు. విగ్గు చేతిలోకి వచ్చింది.

భర్త బట్టతలని చూస్తూ అవాక్కయిపోయింది శశిరేఖ.

''రేఖా! ఇకనుంచి నువ్వూ నేనూ నాటకాలు ఆడవద్దు. నువ్వు పగలు కూడా అందంగా కనపడు''

తనకా చెర తప్పినందుకు సంతోషించి ''మరి ..ఇంటివద్దయినా విగ్గు మానేయండి మీరు'' అంది.

''నా గుండు నీకు అసహ్యంగా లేదూ?''

''మీ మనసు తీయగా, మీ అభిమానం హాయిగా వున్నప్పుడు ఆకారం వికారంగా ఎందుకుంటుంది? అదీ అందంగానే వుంటుంది. మనం చూసే తీరులో వుంటుంది యిష్టం, అయిష్టం..''

గుర్నాథానికి కొండంత సమస్య తీరిపోయింది. భార్యని ముద్దు మీద ముద్దు నాన్‌స్టాప్‌గా పెట్టేసుకున్నాడు.

''ఇకచాలు కొన్ని రాత్రికి వుంచండి'' అంది మోహనంగా శశిరేఖ.

☆

## ఇంకా పదారేళ్లే!

**'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే' అంటూ పోకిరిలో డాన్సు చేసిన ముమైత్ ఖాన్ నిఝంగా కూడా పదహారేళ్ల వయసేనట ఇప్పుడు. తను మూడేళ్ల క్రితం అంటే తన 13వ ఏట బాలీవుడ్‌లోకి అడుగుపెట్టినట్టు చెబుతుంది. మూడేళ్ల తర్వాత తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకోగలిగాను అంటూ గొప్పగా చెప్పుకుంటుంది ముమైత్. కేవలం ఐటమ్ గాళ్‌గానే కాకుండా నటిగా కూడా ప్రాధాన్యత గల పాత్రల్ని పోషించాలని తెగ ఉబలాటపడుతోంది.**